సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

ఆట.. పాట.. ఆధ్యాత్మిక కలబోత

- కోలాటానికి పెరుగుతున్న ఆదరణ
- ఆసక్తి చూపుతున్న యువత, మహిళలు
- జానపద కళల పట్ల మక్కువ



సిరి వినాయక కోలాటం బృందం

సంప్రదాయ కళలకు ఆదరణ పెరుగుతోంది. ప్రాచీన కళలుగా భావించే చిడతల భజనలు, కోలాటానికి విశేష ఆదరణ లభిస్తోంది. మారుతున్న కాలంతో పాటు అంతరించిపోతున్న కళలకు పూర్వాదరణ లభిస్తోంది. అందులో భాగంగా కోలాటానికి క్రమేపీ ఆదరణ పెరుగుతోంది. కోలాటం నేర్చుకునేందుకు యువత, మహిళలు ఉత్సాహం చూపిస్తున్నారు.

అల్లిపురం: కోలా అంటే కర్ర ఆట.. ఇది ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా భారతదేశంలోనే ప్రసిద్ధి చెందింది. దీనిని గుజరాత్‌లో 'దండియారాస', రాజస్థాన్‌లో 'గర్బ' అని పిలుస్తారు. కోలాటం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందింది. నాలుగైదు సంవత్సరాలుగా నగరాల్లో కూడా పలువురు దీనిని ఆదరిస్తున్నారు. మహిళలు గ్రూపులుగా చేరి కోలాటం నేర్చుకుంటున్నారు. అవసరమైనప్పుడు దేవాలయాలు, వేడుకల్లో ప్రదర్శిస్తూ ప్రతిభ చూపుతున్నారు.

వేడుకలు.. ఆలయాల్లో ప్రదర్శనలు..

సుమారు 10 నుంచి 15 మంది బృందంగా ఏర్పడి ఒకే రంగు దుస్తులు ధరించి పాటకు అనుగుణంగా పదం కలుపుతూ, చిడతలు కొడుతూ, అడుగులు వేస్తూ తిరుగుతూ కోలాటం ఆడుతారు. ఇప్పుడు దాదాపు ప్రతి వీధిలో ఒక కోలాటం గ్రూపు తయారయింది. నియోజకవర్గంలో 32, 33, 34 వార్డుల్లో సుమారు 25 నుంచి 30 బృందాలు తయారయ్యాయి. వారు స్థానికంగా గల దేవాలయాలు, ఉత్సవాల్లోనే కాకుండా కనకమహాలక్ష్మి దేవస్థానం, సింహాచలంతో పాటు తిరుపతి, తిరుచానూరు, విజయవాడ వంటి ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రత్యేక ఉత్సవాల సమయంలో కోలాటం ఆడుతున్నారు.

ప్రతిభకు వేదిక..

సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరు తమలో గల ప్రతిభను ప్రదర్శించేందుకు దీనిని వేదికగా చేసుకుంటున్నారు. అదే విధంగా కోలాటం కళకు పాచుర్యం పెరిగేందుకు సోషల్ మీడియా కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ముఖ్యంగా రీల్స్ ద్వారా కోలాటానికి మంచి ప్రచారం అందుతుందని చెప్పవచ్చు. ఇలాంటి తరుణంలో మానసిక, శారీరక దృఢత్వానికి సహకరించే కోలాటాన్ని నేర్చుకోవడానికి ఎంతో మంది ముందుకు వస్తున్నారు.



బల్లిగిరి దేవాలయంలో ప్రదర్శన ఇస్తున్న కోలాటం బృందం

కళలపై ఆసక్తి పెంచేందుకే..



మన కళలు, సంస్కృతిని పరిరక్షించేందుకు నేటి తరం వీటిని ఆదరించాలి. అందుకే మా ఈ చిన్ని ప్రయత్నం. ఆలయాలు, పండగల్లో ప్రదర్శనలిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. కోలాటానికి ఆదరణ పెరగడం ఎంతో ఆనందంగా ఉంది.

– నాగలక్ష్మి, కోలాటం శిక్షకురాలు, అంజనాద్రి భజన మండలి

ఔత్సాహికులకు శిక్షణ..



నేరెళ్లకోనేరు ప్రాంతంలో కోలాటం పై గృహిణులు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారికి కోలాటంలో శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటి వరకు సింహాచలం, తిరుపతి, తిరుచానూరు వంటి ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చాం.

– వలగల శ్రీదేవి, నిర్వాహకురాలు, సిరి వినాయక కోలాట బృందం, నేరెళ్లకోనేరు

భగవంతుడికి ప్రీతిపాత్రం..



కోలాటం భగవంతుడికి ఎంతో ప్రీతిపాత్రమైంది. కోలాటం ఆడుతూనే భగవన్నామ స్మరణ చేస్తుంటాం. లయ తప్పకుండా కోలాటం ఆడడం అంత సులువైన పని కాదు. ఎంతో శ్రద్ధతో కోలాటం నేర్చుకున్నాం. అంతా ఆ భగవంతుని దయ.

– జానకి సుగంధ, సిరి వినాయక కోలాట బృందం



అంజనాద్రి భజన మండలి కోలాటం బృందం

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం..

కోలాటం ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో దోహదపడుతోంది. ఈ నృత్యం నేర్చుకునేందుకు చిన్నారులు కూడా ఆసక్తి చూపడంతో అన్ని తరగతుల వారు తమ పిల్లలకు కోలాటం నేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పూర్వవైభవం..

కోలాటం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. మన సంస్కృతిని భావితరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో కళాకారులు, కళాభిమానులు చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. పాశ్చాత్య పోకడల నుంచి యువతను అసలు సిసలైన జానపద కళల వైపు నడిపించాలనే ఆలోచనతో తమకు వచ్చిన కళను పది మందికి పంచుతున్నారు. ఆధ్యాత్మిక సేవలో తరించడంతో పాటు ఉపాధి పొందుతున్నారు.

ఆరోగ్యం చేకూరుతుంది..



కోలాటం వల్ల ఆధ్యాత్మిక చింతనతో పాటు శారీరక శ్రమ కలుగుతుంది. దీని వల్ల ఆరోగ్యం చేకూరుతుంది. గతంలో ఇంటి వద్ద పనులకే సరిపోయేది. ఇప్పుడు త్వరగా పనులు ముగించి కోలాటం కోసం సమయం కేటాయిస్తున్నాం. తద్వారా ఆరోగ్యం, ఆహ్లాదం లభిస్తోంది.

– సురకల కోదండమ్మ, కోలాటం కళాకారిణి, నేరెళ్లకోనేరు

క్లుప్తంగా

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు



ద్వారకానగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అక్కడి ఫ్లెక్సీలు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిమిత్తం కలెక్టర్ 30న షెడ్యూల్ విడుదల చేశారు. వచ్చేనెల 27వ తేదీన ఎన్నికలు, మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ 42 రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసినట్లు తెలిపారు. అలాగే 40 హోర్డింగులు, 205 బ్యానర్లు, 350 వివిధ పార్టీల జెండాలు, 180 ఫ్లెక్సీలు తొలిగించినట్లు తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

దాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో గల స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించనున్న ఆయా కోర్సుల్లో చేరేందుకు ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్లలోపు గల నిరుద్యోగులు అర్హులన్నారు. 3 నెలల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ, యూనిఫామ్, బుక్స్ వంటి సదుపాయాలు కలిప్తిస్తున్నామని, శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 7207953919, 7337076665 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆకట్టుకున్న సత్యశ్రీ సినీ గీతాలాపన



సత్యశ్రీని అభినందిస్తున్న ఆచార్య జీఎస్‌ఎన్ రాజు తదితరులు

దాబాగార్డెన్స్: మెలోడి క్రియేటర్స్ సంస్థ 25వ వసంతంలోకి అడుగిడిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నాదం నీ దీవెన' పేరిట 3 గంటల సినీ సంగీత విభావరి నిర్వహించారు. వర్ధమాన గాయని సలాది సత్యశ్రీ పలు తెలుగు చలన చిత్రాల్లోని సినీ గీతాలు ఆలపించి ప్రశంసలు పొందారు. సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి గాయని సత్యశ్రీని, సంస్థ నిర్వాహకులను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ప్రోగ్రాం కన్వీనర్ కె. వీరాస్వామి సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ), ఉషా చీరాల, కొణతాల రాజు, ఎం. మస్తాన్‌రెడ్డి, వర్రె నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

సహచరుని కుటుంబానికి బాసట



ఆర్థిక సాయం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: విశాఖ వెల్డింగ్ అసోసియేషన్ సభ్యుడు, వెల్డింగ్ షాపు ప్రతినిధి, వెలంపేటకు చెందిన పి. రాజు ఇటీవల మృతి చెందాడు. శనివారం దశదిన కర్మ నిర్వహించారు. చనిపోయిన రాజు కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అసోసియేషన్ సభ్యులందరూ రూ.25 వేలు, అసోసియేషన్ తరపున మరో రూ. 20 వేలు మొత్తంగా రూ.45 వేల ఆర్థిక సాయం రాజు కుటుంబ సభ్యులకు అందజేసి టీం స్పిరిట్ చాటుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు రఘు, సెక్రటరీ విజయ్ నేతృత్వంలో ఈ ఆర్థిక సాయం చేశారు.

బాలబాలికల వైద్యం కోసం ప్రత్యేక వాహనం



వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బాలబాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి సత్వర చికిత్స అందించేందుకు ప్రవేశ పెట్టిన ప్రత్యేక వాహనాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. 0–19 ఏళ్లలోపు బాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలతో బాధపడుతున్నవారిని గుర్తించి, వైద్య సేవలందించనున్నారు. ఆరోగ్య కేంద్రాల నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)కు తరలించే నిమిత్తం ఈ ప్రత్యేక వాహన సదుపాయం కల్పించామన్నారు. ముందుగా నిర్ణయించిన నిర్ణీత సమయాల్లో ఆయా ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడ వైద్యాధికారులు నిర్ధారించిన బాలబాలికలను డీఈఏసీ సెంటర్‌కు తరలిస్తుంది. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.హారిక, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఇ.శాంతిప్రియ, డీఈఐసీ మేనేజర్ మోహన్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పూర్వ వైభవానికి కృషి



వాసుపల్లి గణేష్‌కుమార్, రవితేజను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని పార్టీ దక్షిణ యువజన విభాగం అధ్యక్షుడు తాడి రవితేజ పేర్కొన్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ఆయన శనివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 30వ వార్డు పార్టీ నాయకులు వాసుపల్లిని, రవితేజను ఘనంగా సత్కరించారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 30వ వార్డు నాయకులు దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, వడ్డాది దిలీప్, గోవిందరావు, రాము, మీనా, మణి, జ్యోతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● అధ్యక్షుడికి అద్వితీయ సత్కారం



జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించిన నేపథ్యంలో బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ ఆధ్వర్యంలో యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, బోని శివరామకృష్ణ, మహిళా విభాగం పేడాడ రమణకుమారి జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జానికిరామ్, ముఖ్య నేతలు జాన్‌వెస్లీ, మహ్మద్ షరీఫ్, పీతల వాసు, టెవర మహేష్, కంటుమచ్చు సాగర్, చోడిపల్లి శివ, సూర్య వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దివ్యాంగులకు బాసటగా..



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. పెద్ద ఎత్తున



హాజరైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ద్రోణంరాజు శ్రీనివాస్ సేవలు మరువలేనివి

జగదాంబ: దివంగత నేత ద్రోణంరాజు శ్రీనివాసరావు రాజకీయ దురంధరుడు, మృదు స్వభావి అని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ద్రోణంరాజు శ్రీనివాసరావు 64వ జయంతి సందర్భంగా పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో పేదలకు అన్నదానం చేశారు. పాతనగరం అభివృద్ధిలో ద్రోణంరాజు శ్రీనివాస్ పాత్ర ఎంతో ఉందన్నారు. రాజకీయ వారసత్వంగా ఆయన తనయుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ప్రజలకు సేవ చేస్తారన్నారు. ఈ సందర్భంగా పేదలకు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సంస్థ రౌండ్ టేబుల్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

ప్రజల ఆకాంక్షలు పట్టని బీజేపీ ప్రభుత్వం



దీక్షలో పాల్గొన్న సీఎఫ్‌టీయూఐ ప్రతినిధులు

సీతమ్మధార: బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని సీఎఫ్‌టీయూఐ ప్రతినిధి లక్ష్మి అన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దేశద్రోహం అన్నారు. ఎంతో మంది ప్రాణత్యాగం, 62 గ్రామాల ప్రజల ఆస్తుల ధారాదత్తంతో వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌టీయూఐ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడు అరెస్టు

దాబాగార్డెన్స్: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న సురపతి చిన్నారావును వన్‌టౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ జేడీ బాబు నేతృత్వంలో వన్‌టౌన్ పోలీసులు, సిబ్బంది చిన్నారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వృద్ధుడ్ని కాపాడిన లైఫ్‌గార్డ్స్



బీచ్‌లో కొట్టుకుపోతున్న చిట్టిబాబును ఒడ్డుకు చేరుస్తున్న జీవీఎంసీ బీచ్ లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్ : ఏడు పదుల వయసులో ఆ పెద్దాయనకు ఏం కష్టమొచ్చిందో.. జీవితాన్ని వదిలి తీరని లోకాలకు వెళ్లిపోదామనుకున్నాడు..జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ సకాలంలో స్పందించి ఆ వృద్ధుడ్ని కాపాడారు. వివరాల్లోకి వెళ్తే..నగరంలోని ఎన్ఏడీ ప్రాంతానికి చెందిన సున్నా చిట్టిబాబు (72) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడతున్నాడు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని తనువు చాలించాలనుకున్నాడు. మత్స్యదర్శిని సమీపాన ఆర్కేబీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ ఆనంద్, ధనరాజ్, అరవింద్, పోలిరాజులు బీచ్‌లో కొట్టుకుపోతున్న ఆ వృద్ధుడ్ని కాపాడారు. అనంతరం పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. చిట్టిబాబు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

వైభవంగా శ్రీభక్త మార్కండేయ జయంతి



హోమంలో పాల్గొన్న రామ్‌కుమార్, శ్రీనివాస్ దంపతులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన భావన రుషీశ్వర ఆలయంలో పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం నేతృత్వంలో శనివారం శ్రీభక్త మార్కండేయ జయంతి వైభవంగా నిర్వహించారు. ముందుగా లోక కల్యాణార్థం విఘ్నేశ్వర పూజ, పరమేశ్వరునికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు జరిపి, అనంతరం మహామృత్యుంజయ హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పూజలు జరిపారు. కొప్పుల రామ్‌కుమార్, గుదే శ్రీనివాస్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు పద్మశాలి ప్రముఖులు, స్థానికులు పరిసర ప్రాంత వాసులు అధిక సంఖ్యలో పాల్గొని భావన రుషి భద్రావతి సమేత పరమేశ్వరుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి. రాజారావు, ఎస్. సూరిబాబు, ఎస్. రామారావు, వి. గాయత్రి ఫణికుమారి, భక్త మార్కండేయ ట్రస్ట్ సభ్యులు, పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలతోనే ప్రజల మన్నన



డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్‌టీసీ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన సేవలతోనే ప్రజల మన్నన పొందగలమన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందివ్వడం, ప్రయాణికులు కూర్చొనేందుకు వీలుగా బెంచీల ఏర్పాటు, ప్రతి బస్ కాంప్లెక్స్‌లో ఫ్యాన్లు తిరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై దృష్టి పెట్టాలన్నారు. ఏపీఎస్ఆర్‌టీసీ వాట్సప్ 9552300009 ద్వారా ఆర్టీసీ సేవలు పొందవచ్చని, క్యూఆర్ కోడ్ ద్వారా బస్ స్టేషన్ల ఫీడ్ బ్యాక్ ఎప్పటికప్పుడు తెలుసుకుని సేవలందించాలన్నారు. పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్లు జి. శ్రీధర్, యర్రంరాజు, మాధురి, నాయుడు, ఉజ్వల, హిమ బిందు, అప్పారావు, నాయుడు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యాకులమాత మహోత్సవం



పాదయాత్రను ప్రారంభిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

కంచరపాలెం: విశాఖ అతి మేత్రాసనం, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండ దాబాలకు చెందిన వ్యాకుల మాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 2 ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో కొండ దాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు సెయింట్ పీటర్స్ విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర..

జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకన వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు స్నాక్స్, ఉచిత భోజనం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాయి. ఆదివారం జరిగే ఉత్సవానికి పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సిటీ బస్సులు ఏర్పాటు చేసింది.

వన్‌టౌన్ సీఐ హెచ్చరిక

దాబాగార్డెన్స్: ఎటువంటి పనులు లేకుండా రోడ్లపై, ప్రభుత్వ కార్యాలయాలు, వీధులు, మార్కెట్లలో అనుమానాస్పదంగా తిరిగితే అటువంటి వారిపై చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ జేడీ బాబు హెచ్చరించారు. శనివారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురు యువకులను ప్రశ్నించి హెచ్చరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com